క్లుప్తంగా

రైతులకు జింకల బెడద



పైర్లను మేస్తున్న జింకలు

మద్దికెర: అసలే వానలు రాక ఇబ్బందులు పడుతున్న రైతులకు జింకలు పెద్ద సమస్యగా తయారవ్వడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి ఒట్టి నేలలో విత్తనం వేసి వర్షం కోసం ఎదురు చూస్తున్నామని కొద్దిపాటి మొలిచిన పంటలను జింకలు తినేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి జింకలను పట్టుకుని పార్కులకు తరలించి రైతులను కాపాడాలని కోరుతున్నారు.

వేరుశనగ పంట తొలగింపు



పగిడిరాయి వద్ద ట్రాక్టర్ గుంటెకతో వేరుశనగ పంట తొలగిస్తున్న దృశ్యం

తుగ్గలి: ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పైర్లలో ఎదుగుదల లేకపోవడంతో రైతులు పంటను తొలగిస్తున్నారు. ఈ ఏడాది మండలంలో దాదాపు 11 వేల హెక్టార్లలో రైతులు వేరుశనగ సాగు చేశారు. తీవ్ర వర్షాభావంతో పంట ఎదుగుదల లోపించింది. దీనికి తోడు భూమిలో తేమ లేకపోవడంతో రైతులు వేరుశనగ పైరును తొలగించేందుకు ట్రాక్టర్లు, ఎద్దుల గుంటికలతో పొలాన్ని పాస్తున్నారు. వర్షాభావంతో ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఢిల్లీకి తరలిన 'అమృత్ కలశ్'

చిప్పగిరి: నా మట్టి – నాదేశం కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించే అమృత కలశ యాత్రకు మండలం నుంచి బీజేపీ మండలాధ్యక్షుడు పరందామయ్య ఆధ్వర్యంలో నేతలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ సూచనలతో నా మట్టి – నా దేశం కార్యక్రమానికి చిప్పగిరి మండలం నుంచి పవిత్ర మట్టిని దేశ రాజధాని ఢిల్లీకి తీసుకెళుతున్నట్లు వారు తెలిపారు.

నేడు ఆర్బీకే, హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం



చెరుకులపాడులో నిర్మాణం పూర్తయిన ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎమ్మెల్యే స్వగ్రామమైన చెరుకులపాడులో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సోమవారం ప్రారంభించనున్నట్లు పీఆర్ ఏఈ సురేంద్రనాథ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ఈ భవనాలను ప్రారంభించడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. వీటి ప్రారంభంతో రైతులకు, రోగులకు ప్రభుత్వం తరఫున అన్ని సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. మండలంలోని మిగతా గ్రామాల్లో కూడా ఆయా భవన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం



బురుజులలో నిర్మాణం పూర్తయిన విలేజ్ హెల్త్ క్లినిక్

మద్దికెర: గ్రామాల్లోనూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల నిర్మాణానికి పూనుకున్నారు. అందులో భాగంగా మండలంలోని బురుజుల, మద్దికెర-4 హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైనట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. హెల్త్ క్లినిక్‌లో ఏఎన్ఎంతో పాటు ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండి వైద్య సేవలందించనున్నారు.

విజయవంతం చేద్దాం

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈ నెల 31న స్థానిక కార్యాలయంలో ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని సీనియర్ నాయకులు హరిప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31న ముంబైలో ఈ సంఘం ఏర్పడిందని తెలిపారు. నాటి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గళం విప్పిన భారత కార్మిక వర్గం ఇదేనన్నారు. అప్పటినుంచి ఇప్పటి వరకు కార్మికుల హక్కులను కాపాడటం, సమస్యలపై పోరాటాలు చేస్తూ వస్తుందన్నారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని ఆయన కోరారు.

ఉన్న ఊరిలో ఉన్నత వైద్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన
- గ్రామాల్లోనే స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు
- ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, మందులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



హెచ్. కైరవాడిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన (ఫైల్)

గోనెగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోనే వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. స్పెషలిస్ట్ వైద్యులను గ్రామాలకు పంపి ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తూ వారికి ఆరోగ్య భరోసా ఇస్తోంది. శిబిరాలకు వచ్చిన రోగులకు సమగ్ర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది. మెరుగైన వైద్య సేవలు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపిస్తోంది. తమ గ్రామానికి నిపుణులైన వైద్యులు వచ్చి వైద్య సేవలు అందిస్తుండడంతో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది.

అన్ని శాఖల సమన్వయం

మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో వైద్య, ఆరోగ్య శాఖ, మండల పరిషత్, గ్రామ పంచాయతీ, రెవెన్యూ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. మెరుగైన చికిత్స అవసరమైన వారిని వ్యాధి తీవ్రతను బట్టి ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపిస్తున్నారు. అక్కడ వారికి పూర్తి ఉచితంగా వైద్యం అందించడంతో పాటు ఇంటికి వచ్చిన తర్వాత కోలుకునే వరకూ వైద్యులు పర్యవేక్షించనున్నారు.

ఇప్పటికే మండలంలో 6,015 మందికి వైద్య సేవలు

మండలంలో 22 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ఉన్నతాధికారులు ప్రణాళిక రూపొందించారు. సెప్టెంబర్ 30న వైద్య శిబిరాలు ప్రారంభమవ్వగా ఈ నెల 28వ తేదీ నాటికి 20 శిబిరాలు నిర్వహించారు. వీటిలో 6,015 మంది వైద్య సేవలు పొందారు. 230 మందిని ఉన్నత వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారందరికీ మందులు పంపిణీ చేశారు.

అన్ని పరీక్షలు చేశారు



గతంలో వైద్యం కోసం ఆర్ఎంపీలను సంప్రదించేవాళ్లం. లేకపోతే పెద్దాసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. వ్యయ ప్రయాసలతో కూడిన వ్యవహారం. ఇప్పుడు పెద్ద డాక్టర్లే మా ఊరికి వచ్చి ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. నా ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్ష, బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు.

– గోవిందమ్మ, నెరుడుప్పల గ్రామం

ప్రజా స్పందన బాగుంది



స్పెషలిస్ట్ డాక్టర్లు గ్రామాలకు వచ్చి వైద్య సేవలందిస్తుండడంతో ప్రజల నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు మంచి స్పందన వస్తోంది. శిబిరాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తున్నాం. ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్యం అందించడం జరుగుతోంది.

– డాక్టర్ రంగ రవళి, గోనెగండ్ల పీహెచ్‌సీ

హక్కుల సాధన కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న టి.సైకిలాబ్‌బాబు

ఎమ్మిగనూరుటౌన్: రాజ్యాంగ కల్పించిన హక్కుల సాధన కోసం అందరినీ ఐక్యం చేసి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని దళిత్ సోషన్ ముక్తిమంచ్ జాతీయ ఉపాధ్యక్షుడు టి.సైకిలాబ్ బాబు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగం– మనువాదం అంశంపై కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ హక్కుల కోసం డిసెంబర్ 4న పార్లమెంట్ ముందు మహాధర్నా చేపట్టడం జరుగుతుందని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సదస్సులో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, నాయకులు కృష్ణ, విజయమ్మ, కరుణాకర్, రాజు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏళ్ల సమస్య పరిష్కారం



యాటకల్లులో సీసీ రోడ్డు నిర్మాణానికి చదును చేస్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలోని యాటకల్లు గ్రామంలోని ప్రధాన వీధి గుంతలు పడి అధ్వానంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అంతేగాకుండా కైరుప్పల, కలపరి, కారుమంచి గ్రామాలకు వెళ్లాలంటే యాటకల్లు ప్రధాన వీధి గుండా వెళ్లాల్సి ఉండేది. దీంతో ఆయా గ్రామాల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షం పడితే గుంతల్లో ఆటోలు, స్కూటర్లు వెళ్లేందుకు అవస్థలు వర్ణణాతీతం. గ్రామస్తులు సమస్యను గత టీడీపీ ప్రభుత్వంలో అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి యాటకల్లుకు వచ్చిన కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి సర్పంచ్ సుధమ్మ, గ్రామస్తులు సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సచివాలయం నిధులు రూ.20 లక్షలను కింద డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణానికి మంజూరు చేశారు. దీంతో పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ ఆదివారం తెలిపారు. సమస్య పరిష్కారమవుతుండడంతో సర్పంచ్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చురుగ్గా 'నాడు–నేడు' పనులు

తుగ్గలి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రభుత్వం అందిస్తోంది. దీని కోసం పాఠశాలల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మనబడి నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులను ప్రభుత్వం కేటాయించింది. ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ తెచ్చేలా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు నాడు–నేడు రెండో విడత కింద మంజూరైన రూ.58 లక్షలతో చేపట్టిన అదనపు తరగతుల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. త్వరలోనే పనులు పూర్తిచేసి తరగతి గదులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని పీఎంసీ చైర్మన్ నాగరాజు తెలిపారు.



పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ





చెరుకులపాడులో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎమ్మిగనూరులో చెక్కును అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆదివారం చెరుకులపాడులోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద 7 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులకు ఆమె పంపిణీ చేశారు. కృష్ణగిరి మండలం కర్లకుంట గ్రామానికి చెందిన ఈడిగ నారాయణకు రూ.30 వేలు, తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామానికి చెందిన ఇంతియాజ్ బాషాకు రూ.2 లక్షలు, ఉప్పరపల్లికి చెందిన అప్ప విమలకు రూ.1.20 లక్షలు, వెల్దుర్తి మండలం లక్ష్మీనగరానికి చెందిన కురువ ఎల్లప్పకు రూ.22 వేలు, నర్సాపురానికి చెందిన నర్సింగ్ శివకేశవరెడ్డికి రూ.2,40 లక్షలు, గువ్వలకుంటకు చెందిన మంగళి జ్యోతికి రూ.36 వేలు మంజూరుకాగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి పేదవాడికి ఆరోగ్య శ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఆపదలో ఉన్నవారిని సీఎం వైఎస్ జగన్ ఆపద్బాంధవుడిగా అదుకునేలా చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌కు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో ప్రజా వైద్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటి ప్రాధాన్యతనిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నియోజకవర్గ పరిధిలోని గోనెగండ్ల మండలం పెద్దనెలటూరు గ్రామానికి చెందిన రఫూల్‌కు మంజూరైన రూ.7 లక్షల చెక్కును అతని కుమారుడు జహంగీర్‌కు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి గృహంలో ఆయన అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని 1వ వార్డుకు చెందిన లలితమ్మకు రూ.60 వేలు, వాసుదేవారెడ్డికి రూ.1.10 లక్షలు, దైవందిన్నె గ్రామానికి చెందిన వీరేష్‌కు రూ.2 లక్షల ఆర్థిక సహాయం చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జాబితాలో లేని వ్యాధులకు శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు రానున్న ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గజ్జహళ్లిలో చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం



తేరుబజారులో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: ఎన్నో ఏళ్లుగా నెలకొన్న గజ్జహళ్లి పోతులింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న తేరుబజారు రస్తా సమస్యను కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాలతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పరిష్కారానికి చర్యలు చేపట్టారు. చాలా ఏళ్లుగా వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్న సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్ ఆరుబట్ల నాగమ్మ, వైస్ ఎంపీపీ మహాదేవమ్మ ఆధ్వర్యంలో సచివాలయ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. ఆదివారం తేరుబజారులో ఆర్చ్ నుంచి పోతులింగేశ్వరస్వామి ఆలయం వరకు పూజలు చేసి రోడ్డు పనులు మొదలు పెట్టారు. రోడ్డు నిర్మాణంపై గ్రామస్తులు మంత్రి గుమ్మనూరు జయరాం, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇమామ్‌హుసేన్, దస్తగిరి, మూకయ్య, గిరిమల్ల, కిష్టప్ప, సవారి, తిమ్మయ్య తదితరులు రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ కమిటీ ఎన్నిక

పత్తికొండ రూరల్: మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డివిజన్ కమిటీని స్థానిక షాదీఖానాలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆదివారం ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా హుసేన్‌సాహేబ్, ప్రధాన కార్యదర్శిగా గౌస్, వైస్ ప్రసిడెంట్‌గా సాలెహాబొఖారి, కోశాధికారిగా జిలానీ, కార్యదర్శులుగా అబ్దుల్ రహిమాన్, రజాక్, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శులుగా ఫకృద్దీన్, అన్వర్ బాషా, రోషన్, జాకీర్‌హుసేన్, అజహరుద్దీన్, అలీ ఎన్నికయ్యారు.

తాగునీటిని వృథా చేయొద్దు

ఆలూరు: ఎస్ఎస్ ట్యాంకుల నుంచి పల్లెలకు సరఫరా చేస్తున్న నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య ప్రజలకు సూచనలు చేశారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. హాలహర్వి మండలంలోని బాపురం, చింతకుంట గ్రామాల్లోని ఎస్ఎస్ ట్యాంకులలో నీటి లభ్యత పరిశీలించినట్లు చెప్పారు. గ్రామాల్లో కొందరు ఇష్టానుసారంగా నీటిని వృథా చేస్తుండడంతో మిగతా వారికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఎస్ఎస్ ట్యాంకుల నుంచి గ్రామాలకు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీలు ఎక్కువ కావడంతోనే సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే వివిధ మండలాలకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు, కాంట్రాక్టు కార్మికులకు సూచనలు చేశామని వేగంగా మరమ్మతు పనులు చేస్తున్నట్లు చెప్పారు. జలజీవన్‌మిషన్‌కు ఎంపికైన గ్రామాల్లో పనులను త్వరితగతిన పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

కృష్ణగిరి: క్రీడల్లో గెలుపోటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని బహుమతి దాత గంగిరాయుడు, గ్రామపెద్దలు లక్ష్మిఈశ్వరయ్య, శంకరయ్య, గోవిందురాజులు తదితరులు సూచించారు. మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో వాల్మీకి జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ఆదివారం వారు ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి చాటాలని, ఇలాంటి టోర్నీల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. క్రీడల్లో రాణించాలనుకునే వారికి ఈ గ్రామీణ ఆటలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొంటే మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 42 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన వారికి దాతల సహకారంతో రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందజేయనున్నట్లు వారు వెల్లడించారు.

తీరిన రహదారి కష్టాలు



నాడు: గుంతలమయంగా ఉన్న రోడ్డు



నేడు: రామదుర్గం గ్రామానికి నూతనంగా వేసిన రోడ్డు

చిప్పగిరి: ఎన్నో ఏళ్ల నెలకొన్న రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలూరు–గుంతకల్లు ప్రధాన రహదారి నుంచి మండలంలోని రామదుర్గం గ్రామానికి వెళ్లే రోడ్డు గతంలో గుంతలమయంగా ఉండడంతో ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేయడంతో గ్రామానికి రహదారి కష్టాలు తీరాయి. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి రోడ్డు సమస్యను గ్రామ ప్రజలు తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో 1.50 కి.మీ మేర రూ.20 లక్షల ప్రభుత్వ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేయడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోవాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడంతో పాటు కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధన అందరి బాధ్యత అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములుగౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప అన్నారు. ఆదివారం స్థానిక ఏపీ ఎన్జీఓ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఎందరో ప్రాణత్యాగాల ఫలితంగా ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే యోచనను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మానుకోవాలన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీని సత్వరం నెలకొల్పి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ రెండు పరిశ్రమల కోసం వచ్చే నెల 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు సహకరించాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాబీర్, సీఐటీయూ నాయకుడు రాముడు, పీడీఎస్‌యూ తాలుకా కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే కమ్యూనిస్టుల పోరాటం



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

తుగ్గలి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేది కమ్యూనిస్టు పార్టీలేనని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా రైతులు సుఖంగా లేరన్నారు. పంజాబ్‌లో మూడు పంటలు పండించే రైతులు కూడా వ్యవసాయం మానేసి రోడ్డు పక్కన డాబా పెట్టుకుంటే మేలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం, కరువు సహాయక చర్యలు, రైతుల ఇబ్బందులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నబిరసూల్, సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్, రైతు సంఘం నాయకులు పెద్ద వీరన్న, ఉమాపతి, వెంకటేశ్వర్లు, పీరా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



పైపులైన్ ఏర్పాటుపై కాలనీవాసులతో మాట్లాడుతున్న నాయకులు

నందవరం: మండల కేంద్రంలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా తెలుగు గేరి, కుమ్మరి గేరి, మఠం వీధిలో పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శివారెడ్డి గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం తెలుగు గేరి కాలనీలో తాగునీటి పైపులైన్ ఏర్పాటు పనులను సర్పంచ్ తోట సావిత్రి, ఉప సర్పంచ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు అడిగిన మేరకు తాగునీటి సమస్య పరిష్కారం కోసం పైపులైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. జీజీఎంపీ నిధులతో గ్రామంలోని ఆయా కాలనీలలో పైపులైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నట్లు వివరించారు. కాలనీ వాసులు సహకరించాలని కోరారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు రమేశప్పగౌడ్, భీమన్నగౌడ్, దత్తాత్రేయగౌడ్ తదితరులు ఉన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేశారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

ఎమ్మిగనూరుటౌన్: కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై అమానుషంగా దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాసులు, కె.బసవరాజు, నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి ముస్తక్‌అహమ్మద్ డిమాండ్ చేశారు. డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆయా యూనియన్ల ఆధ్వర్యంలో వేర్వేరుగా నల్లబ్యాడ్జీలు ధరించి ఆదివారం స్థానిక డిపో వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. మున్ముందు ఇలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా యూనియన్ల నాయకులు భాస్కర్, రఫీక్, ఈరన్న, కేజీ రెడ్డి, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన' కార్యక్రమం

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.